క్లుప్తంగా

చేల గట్ల వెడల్పుతో అదనపు ఆదాయం



వక్కలంకలో చేల గట్లపై నాటిన కూరపాదులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి శ్రీనివాసరావు

అంబాజీపేట: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా చేల గట్లను వెడల్పు చేయడమే కాకుండా వాటిపై కూరపాదుల సాగు చేయడం వల్ల రైతులకు అదనపు ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి శ్రీనివాసరావు అన్నారు. వక్కలంకలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను శనివారం పరిశీలించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్న గుత్తుల ధర్మారావు, పి.గన్నవరం డివిజన్ మాస్టర్ ట్రైనర్ జనుపల్లి నాగమణి వ్యవసాయ క్షేత్రంలో చేల గట్లను వెడల్పు చేశారన్నారు. ఈ గట్లపై వంగ, మిర్చి, టమాట, బెండ, చేమ, పసుపు సాగు చేస్తున్నారన్నారు. చేల గట్లపై సాగు చేయడం వల్ల నాణ్యమైన కూరగాయలతో పాటు రైతులకు అదనపు ఆదాయం వస్తుందని రైతులకు వివరించారు. ప్రకృతి సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించడమే కాకుండా నాణ్యమైన కూరగాయలు పండించవచ్చన్నారు. అదనపు జిల్లా అధికారి ఎంవీవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

కీటక, నీటిజనిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: వర్షాలు పడుతున్న నేపథ్యంలో కీటక జనిత, నీటి జనిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్.రాజబాబు అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా పుల్లేటికుర్రులో ఇంటింటా ఫీవర్ సర్వేను సీహెచ్‌వో ఎం.రవికుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. రాజబాబు, రవి కుమార్‌లు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, అతిసారం, టైఫాయిడ్, జాండీస్ వంటి వ్యాధులు వ్యాపించే పరిస్థితులు ఉంటాయన్నారు. వీటన్నింటికి పరిష్కారం ఒక్కటేనని ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా నిరుపయోగ సామగ్రిలో వారం రోజులకు పైబడి స్తబ్దతతో కూడిన నీటి నిల్వలు తక్షణమే తొలగించుకోవాలన్నారు. చెత్తను డస్ట్‌బిన్‌లో మాత్రమే వేయాలని, డ్రైయిన్లలో వేయరాదన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వామి సన్నిధిలో సౌత్ సెంట్రల్ రైల్వే డీఐజీ



అంతర్వేది ఆలయంలో డీఐజీ వల్లేశ్వర బాపూజీకి చిత్రపటం ఇస్తున్న ఏసీ ప్రసాద్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో శనివారం సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ డీఐజీ వల్లేశ్వర బాపూజీ కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. ఆయనకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ స్వామి చిత్రపటం అందజేశారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కొత్తపేట: స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాజమహేంద్రవరం ఆకీరా కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సంఘ నాయకుడు యేడిద సత్తిరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు, అన్ని రకాల ఆరోగ్య బీమాదారుల కంటికి సంబంధించిన వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని, ఈ పథకంలో అనుమతించిన శస్త్ర చికిత్సలు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. కంటి వ్యాధులతో బాధపడుతున్న అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సత్తిరాజు కోరారు.

20వ తేదీలోగా ఈ-కేవైసీ చేయించుకోవాలి

సఖినేటిపల్లి: అన్నదాతా సుఖీభవ పథకంలో అర్హులైన రైతులు విధిగా రైతు సేవా కేంద్రంలో ఈ నెల 20వ తేదీ లోగా బయోమెట్రిక్ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ పీవీ నరసింహారావు తెలిపారు. ఈ మేరకు సఖినేటిపల్లిలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 21న అన్నదాత సుఖీభవా పథకం కింద రూ.5 వేలు, పీఎం కిసాన్ పథకం కింద రూ.2 వేలు చొప్పున రైతుల వ్యక్తిగత ఖాతాల్లోకి జమ అవుతాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పి.గన్నవరం: అనారోగ్యంతో బాధపడుతున్న వారిని సీఎం సహాయ నిధి ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గంలోని 33 మంది లబ్ధిదారులకు రూ.25,00,287లను చెక్కుల రూపంలో ఎమ్మెల్యే గిడ్డి శనివారం పి.గన్నవరంలోని తన కార్యాలయంలో అందజేశారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి, దాసరి వీరవెంకట సత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, ఆదిమూలం సూరయ్యకాపు, యడ్ల ఏసు, కేఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

ఉపాధి.. తూతూమంత్రం

- చింతలూరులో రూ.లక్షల్లో నిధులు స్వాహా
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు
- ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల ఇష్టారాజ్యం



చింతలూరు పరిధిలో తూతూమంత్రంగా చేపట్టిన కోరంగి కాలువ అభివృద్ధి పనులు



పంట కాలువలో తొలగించకుండా వదిలేసిన వ్యర్థాలు

అలమూరు: నిరుపేద, సామాన్య వ్యవసాయ కార్మికులకు పనుల విరామ సమయంలో ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ (ఎంజీఎన్ఆర్ఈఎస్) పథకంలో అక్రమాలు ప్రవాహంలా సాగుతున్నాయి. రూ.కోట్ల వ్యయంతో చేస్తున్న ఈ ఉపాధి పనులకు సంబంధించి అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో అక్రమార్కుల ఆటలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఉపాధి పనులు తూతూమంత్రంగా చేపట్టి రూ.లక్షలను స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి పార్టీకి చెందిన క్షేత్రస్థాయి నాయకుల అండదండలతో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధి పనుల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) విధానం కూడా ఫీల్డ్ అసిస్టెంట్ల అతి తెలివికి అపహాస్యం పాలవుతుంది. ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా పంట కాలువల దుస్థితి మాత్రం మారడం లేదు.

తూతూ మంత్రంగా పనులతో రూ.లక్షల్లో స్వాహా

అలమూరు మండలంలోని చింతలూరు పరిధిలోని సూర్యారావుపేట పెద్ద కాలువ పరిధిలో కుడి, ఎడమ వైపున చేపట్టిన పూడికతీత, తుప్పల తొలగింపులో అనేక అక్రమాలు జరిగినట్లు తెలుస్తుంది. ఈ ఉపాధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.9.27 లక్షలు మంజూరు చేయగా పూర్తి స్థాయిలో పనులు చేపట్టకుండానే రూ.8.83 లక్షల మేర ఖర్చు చేసి 2947 మందికి పనులు కల్పించినట్లు రికార్డులు చూపించారు. వాస్తవంగా అంత వ్యయం చేయలేదని, ఒక చోట చేయాల్సిన పనిని, మరో చోట చేశారని స్థానికులు చెబుతున్నారు. పనులను కేటాయించిన చోట కాకుండా కూటమి నేతల సిఫారసు మేరకు పనులు జరగడం వల్లనే ఉపాధి నిధులు పూర్తిగా దుర్వినియోగం అయ్యాయని స్థానికులు చెబుతున్నారు. కోరంగి పంట కాలువను ఏ మాత్రం అభివద్ధి చేయకపోవడంతో చెత్త చెదారంతో నిండిపోయిందని, సక్రమంగా పూడికతీత పనులు చేపట్టకపోవడం వల్ల నిధులు పూర్తిగా పక్కదారి పట్టాయని రైతులు ఆరోపిస్తున్నారు. మరో రెండు రోజుల్లో తూర్పు డెల్టా ప్రధాన కాలువకు పూర్తి స్థాయిలో నీరు విడుదలైతే ఉపాధి అక్రమాలన్నీ నీటిలో కలసిపోనున్నాయి. దీనివల్ల సత్వరమే పంట కాలువల పూడికతీత పనుల నిర్వహణపై సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది.

ఫిర్యాదులను పట్టించుకోవడం లేదు

ఉపాధి పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయని నేరుగా ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. పైగా ఫిర్యాదు దారుడి సమాచారాన్ని సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లకు చేరవేస్తున్నారనే అపప్రథ కొందరి అధికారుల్లో ఉంది. దీనిపై అధికారులకు చేసిన ఫిర్యాదును పట్టించుకోకపోగా ఫిర్యాదుదారుడినే బాధితుడ్ని చేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతుంది. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులు ఫీల్డ్ అసిస్టెంట్లు ఏకచత్రాధిపత్యాన్ని ఉన్నతాధికారులు కూడా నియంత్రించలేకపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే ఉపాధి పనికి రాని వారికి కూడా మస్తర్లు వేసి ఎన్ఎంఎంఎస్ విధానాన్ని బోల్తా కొట్టించడంపై ఫీల్డ్ అసిస్టెంట్లు ఆరితేరిపోయారు అనడంలో సందేహం లేదనే అభిప్రాయంగా ఉంది.

ఉపాధి పనులపై విచారణ జరుపుతాం



మండలంలో వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఎన్ఆర్ఈజీఎస్‌లోని పనుల్లో అరోపణలు ఎదుర్కొంటున్న వాటిపై విచారణ జరిపిస్తాం. అర్హులైన కార్మికులందరికీ ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ఎన్ఆర్ఈజీఎస్ శాఖ పనిచేస్తుంది. ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగితే సత్వరమే ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

– జి.అరుణకుమారి, ఏపీఓ, ఆలమూరు

మహిళలు రాజ్యాంగ హక్కులు కాపాడుకోవాలి



ఆత్రేయపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌హెచ్‌జీ మహిళలు

కొత్తపేట: మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కాపాడుకోవాలని వేజ్ స్వచ్ఛంద సేవ సంస్థ డైరెక్టర్ పోతుమూడి శేషారత్నం పిలుపునిచ్చారు. వేజ్ స్వచ్ఛంద సేవా సంస్థ, బోస్కో సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆత్రేయపురం మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ అవగాహన సదస్సులో పంచాయతీరాజ్ వ్యవస్థపై పాలన విధానంలో స్త్రీ పాత్ర ఎలా ఉండాలి అనే అంశంపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. శేషారత్నం అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ పరిపాలన, అభివృద్ధిలో మహిళా సాధికారత, సమర్థవంతమైన నాయకత్వం సాధనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. రీజినల్ కోఆర్డినేటర్ సోడపనేని అంబేద్కర్, పారా కోఆర్డినేటర్ తరెట్ల రమేష్, ఏపీ స్టేట్ కోఆర్డినేటర్ సంధ్యారాణి, దుర్గ శ్రీదేవి ఎస్‌హెచ్‌జి గ్రూప్ లీడర్సు, యానిమేటర్లు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



జొన్నాడలో అలంకార భూషితుడైన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి



నల్లచెరువు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేంకటేశ్వర స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామికి తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు జరిపారు. వేదపండితులు స్వామికి లక్ష తులసి పూజ నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు భారీ అన్నదానం చేశారు. స్వామికి భక్తులు పటికబెల్లం తులాభారం నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు సందడి చేశారు. స్వామివారికి వివిధ పూజల ద్వారా రూ.4,31,448 ఆదాయం లభించింది. స్వామివారి అన్నదాన ప్రసాదాన్ని 3200 మంది భక్తులు స్వీకరించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దీంతో మండలంలోని చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

యోగాతో నాడులు ఉత్తేజితం



లూటుకుర్రులో జరిగిన యోగా శిక్షణలో పాల్గొన్న ఉద్యోగులు



పినపళ్లలో యోగా శిక్షణ ఇస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

మామిడికుదురు: యోగా సాధన ద్వారా మానవ శరీరంలోని నాడులు ఉత్తేజితమవుతాయని లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపు పేర్కొన్నారు. మండలంలోని 18 గ్రామాల్లో శనివారం యోగాంధ్ర శిక్షణ శిబిరాలు జరిగాయి. సచివాలయ ఉద్యోగులతో పాటు వివిధ శాఖలకు చెందిన వారు, ప్రజా ప్రతినిధులు యోగాలో పాల్గొన్నారు. లూటుకుర్రులో జరిగిన శిక్షణ శిబిరంలో సర్పంచ్ తాతకాపు పాల్గొన్నారు. యోగా వల్ల ప్రతి ఒక్కరికీ ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్యశైలజ, ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, పీహెచ్‌సీ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం..

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం యోగా గురువు మన్నె సత్యనారాయణ ఆధ్వర్యంలో యోగా ఆసనాలపై ట్రయల్ రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకునిపై అధికారులు ట్రయల్ రన్ ఏర్పాటు చేశారు. యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానంపై సత్యనారాయణ తర్ఫీదు ఇచ్చారు. ఎంపీడీఓ కె.సూర్యనారాయణ, తహసీల్దార్, మండల పరిషత్, పీహెచ్‌సీ, ఎంఈఓ కార్యాలయాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పినపళ్లలో..

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ట్రయల్ రన్‌గా శనివారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి మిశ్రమ స్పందన లభించింది. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు మండలంలోని యోగాంధ్ర శిక్షణ పొందిన 216 మంది ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సమీప ప్రజలతో యోగాసనాలు వేయించారు. అయితే కొన్ని గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమాలను తూతూ మంత్రంగా జరిపారు. యోగాలో శిక్షణ పొందిన వారంతా తప్పనిసరిగా ఈనెల 21న వైజాగ్‌లో జరిగే యోగా డేలో పాల్గొనేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీ ఈఓ రాజు విజ్ఞప్తి చేశారు.

సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ అమలు చేశారు?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ అమలు చేశారని కూటమి ప్రభుత్వాన్ని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు సూటిగా ప్రశ్నించారు. మలికిపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ ప్రారంభించి అమలు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఉచిత గ్యాస్ డబ్బులు పడటం లేదని రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు అడుగుతూంటే చంద్రబాబుకు వినబడటం లేదా అని ప్రశ్నించారు. ఉచిత బస్సు ప్రయాణం ఏదని మహిళలు ప్రశ్నిస్తున్నా చెవులు మూసుకున్నారా అని నిలదీశారు. తల్లికి వందనం పథకం అమలులో అడ్డగోలు నిబంధనలు పెట్టి లబ్ధిదారుల్లో కోత విధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబంలో ఉన్న విద్యార్థులందరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పి, ఇప్పుడు సగం మందికే ఇస్తున్నారని విమర్శించారు. అందులోనూ కరెంట్ బిల్లు, కార్లు ఉన్నాయంటూ కోత విధించారని, ఇచ్చిన దానిలో పాఠశాలల నిర్వహణకు రూ.2 వేలు మినహాయిస్తున్నారని చెప్పారు. ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు ఇచ్చిన డబ్బుల్లో రూ.2 వేలు ప్రైవేటు పాఠశాలల నిర్వహణకు ఇస్తారా అని గొల్లపల్లి ప్రశ్నించారు. ప్రతి నెలా తమకు ఇస్తామన్న రూ.1,500 ఎక్కడని పద్దెనిమిదేళ్లు నిండిన మహిళలు అడుగుతున్నా కూటమి నేతలకు వినబడటం లేదని ఆక్షేపించారు. యువతకు ఉపాధి, నిరుద్యోగ భృతి ఎక్కడని ప్రశ్నించారు. ఏ ఒక్క పథకమూ అమలు చేయకుండానే సూపర్ సిక్స్ అమలు చేసేసినట్లు ప్రభుత్వం ప్రకటించడం చౌకబారు ప్రచారానికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఇంత మోసకారి సీఎం ఎక్కడా లేరని అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. నవరత్న పథకాలతో ఇచ్చిన హామీలనే కాక ఇవ్వనివి కూడా అమలు చేసిన ఘనత మాజీ సీఎం జగన్‌కే దక్కిందని గొల్లపల్లి అన్నారు. విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులు పాటి శివకుమార్, అడబాల జానకిరామ్, గుర్రం జాషువా, జిల్లెల్ల ఉదయ కిరణ్, మోకా సురేష్, గుర్రం వెంకట రమణ, తాడి సహదేవ్, మోకా సురేష్, నేతల నాని, ఇలపకుర్తి మురళి పాల్గొన్నారు.

రక్తదాతలు అభినందనీయులు



కొత్తపేటలో రక్తదాన దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ వంశీ, సిబ్బంది



పాశర్లపూడిలో రక్తదాతలకు పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ



రాజోలులో రక్తదానం చేసిన దాతను అభినందిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంబాజీపేట: రక్తదాతలు అభినందనీయులని, ప్రాణపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు దాతలు ఇచ్చిన రక్తం ఎంతగానో దోహదపడుతుందని యోగా గురువు ఆకుల శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ రక్తదాతల వార్షికోత్సవం సందర్భంగా అంబాజీపేట స్వామి వివేకానంద యోగాశ్రమం, ఆయుర్వేదం ఫిజియోథెరపీ ఆస్పత్రి ఆధ్వర్యంలో పలువురు యువకులు అమలాపురం ఆస్పత్రిలో శనివారం రక్తదానం చేశారు. యోగా శ్రీనివాస్ మాట్లాడుతూ గర్భిణులకు ప్రసవ సమయంలోనూ, ఆపరేషన్ల సందర్భాల్లో రక్తం చాలా అవసరం అవుతుందన్నారు. మనిషి ప్రాణాలు కాపాడేందుకు ముందుకు వచ్చిన రక్తదాతలు ప్రశంసనీయమన్నారు. తన ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 28 వేలకు పైగా రక్తదానం చేశామన్నారు. కార్యక్రమంలో యోగా ఆశ్రమం సిబ్బంది, యువకులు, యువతి పాల్గొన్నారు.

పాశర్లపూడిలో..

మామిడికుదురు: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్లో శనివారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. బుద్దాల నాగరత్నం మెమోరియల్ వలంటరీ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో పాశర్లపూడికి చెందిన మానవ సేవే మాధవ సేవ ఫౌండర్, చైర్మన్ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. 32 మంది దాతలు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన దాతలకు ఎమ్మెల్యే సత్యనారాయణ, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పండ్లు అందించారు. రక్తదానం ఎంతో మందికి ప్రాణదానం చేస్తుందన్నారు. దీన్ని ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కొండలరావు, స్థానికులు పాల్గొన్నారు.

కొత్తపేట: రక్తదానాలు చేసి ప్రాణాలను కాపాడే పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కొత్తపేట సీహెచ్‌సీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మోర్త వంశీ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద శనివారం రక్తదాన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ర్యాలీలో 'రక్తం ఇవ్వండి–ఆశను పంచండి... అందరం కలసి ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడుదాం' అనే నినాదాలతో ర్యాలీ సాగింది. కార్యక్రమంలో హెడ్ నర్స్ పి.దేవీజనని, బ్లడ్ స్టోరేజ్ సెంటర్ టెక్నీషియన్లు ఆర్.కిషోర్, ఎస్.నవీన్, ఎస్.ప్రవీణ్, ఐసీటీసీ కౌన్సిలర్ మెల్లం దుర్గాప్రసాద్, టెక్నీషియన్ అడబాల వెంకటరత్నం పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణ దాతలు కావాలి: ఎమ్మెల్యే దేవ

రాజోలు: రక్తదానంతో ప్రాణదాతలు కావాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం రాజోలు సామాజిక ఆస్పత్రిలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే దేవ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని అభినందిస్తూ ఎమ్మెల్యే దేవ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యవసర చికిత్స సమయాల్లో రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చన్నారు. సరైన సమయంలో రక్తం లభించకపోవడంతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రస్తుతం అటువంటి సమస్యలు రాకుండా ప్రభుత్వాస్పత్రిలో బ్లడ్ బ్యాంక్ సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, నాయకులు దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, కోళ్ల బాబి, చాగంటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల పేరుతో తల్లికి కూటమి మోసం

కొత్తపేట: తల్లికి వందనం పథకం అమలులో నిబంధనల పేరుతో ప్రభుత్వం తల్లులను మోసం చేస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు, స్థానిక పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ఎన్నికల సమయంలో విమర్శించి నేడు అదే అమ్మ ఒడి పథకాన్ని ఏ మార్పులు లేకుండా తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.13 వేలు వేయడం మోసం కాదా అని ఆయన ప్రశ్నించారు. పైగా లేనిపోని నిబంధనలతో చాలా మంది లబ్ధిదారులను అనర్హులుగా తొలగించి తల్లులను మోసం చేశారని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే ఎటువంటి షరతులు లేకుండా అందరి తల్లులకు పథకం వర్తింపజేయాలన్నారు.

అర్హులైన తల్లులకు అందని వందనం

మలికిపురం: లక్షలాది విద్యార్థులకు తల్లికి వందనం మంజూరు చేయలేదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, గ్రామ సచివాలయ ఉద్యోగుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగా లక్షలాది అర్హులైన విద్యార్థులు నష్టపోతున్నారని గత నెల రోజుల నుంచి విద్యార్థులు సచివాలయానికి వెళ్లి అడిగితే మాకు సంబంధం లేదని స్కూల్ యాజమాన్యం చూసుకోవాలని, స్కూల్ యాజమాన్యాన్ని అడిగితే మాకు సంబంధం లేదని ఒకరి మీద ఒకరు నెట్టివేశారని, వీళ్ల చేసిన తప్పిదం వలన అర్హులైన విద్యార్థులు తల్లికి వందనం అందక నష్టపోతున్నారని తక్షణమే విద్యాశాఖ, సచివాలయ సిబ్బంది స్పందించి మిగిలిన అర్హులైన విద్యార్థులకు తల్లికి వందనం అందేలా చర్యలు తీసుకోవాలని రాజేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి సన్నిధికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. శనివారం సెలవు రోజు కావడంతో పిల్లాపాపలతో స్వామిని దర్శించుకున్నారు. అలాగే ఆలయంలో నిత్యం నిర్వహిస్తున్న నారసింహ సుదర్శన హోమంలోనూ భక్తులు అధికంగా పాల్గొన్నారు. కాగా నిత్యాన్నదాన పథకంలో మూడు వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ తెలిపారు. కాగా స్వామివారి ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శన టికెట్ల ద్వారాను, వివిధ సేవా టికెట్ల ద్వారాను రూ.1,11,823, నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాల ద్వారా రూ.1,03,709 ఆదాయం సమకూరినట్టు ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా విశ్వేశ్వరాయపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ కలిశారు. ఈ మేరకు స్వామివారి చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు, ఏసీ ప్రసాద్ అందజేశారు.

కంకరలోడుతో ట్రాక్టర్ బోల్తా



గోతిలో పడిన ట్రాక్టర్, ట్రక్కును బయటకు తీస్తున్న పొక్లెయిన్

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో బొమ్మ రాళ్లతిప్ప వద్ద కంకరలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ గోతిలో బోల్తా పడింది. దీంతో అప్రమత్తమైన ట్రాక్టర్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమీపంలో ఉన్న రైతులు స్పందించి పొక్లెయిన్ సాయంతో ట్రాక్టర్, ట్రక్కును బయటకు తీశారు. డ్రైవర్‌ను గ్రామంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స కోసం తీసుకెళ్లారు.

వనుములమ్మ తాళ్ల ఊరేగింపు ఉత్సవం

అయినవిల్లి: మండలంలోని విలస గ్రామంలో వేంచేసిన వనుములమ్మకి జాతర, తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవాల్లో భాగంగా తాళ్ల ఊరేగింపు ఉత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిపారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో యువత పంట పొలాల్లో ఉన్న రెండు తాళ్లను నరికి అమ్మవారి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ రెండు తాళ్లను తీసుకొచ్చి అమ్మవారి ఆలయం ఎదుట నిలబెట్టి పాతారు. అమ్మవారికి ఊయల సేవ నిర్వహించారు. అమ్మవారికి గ్రామోత్సవం జరిపారు. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారికి కానుకలు మొక్కుబడులు చెల్లించారు. ఆదివారం తీర్థ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.